# గొలుసు

- పండా నాగేంద్ర త్రినాథ్




**బం**డి మరో రెండు నిముషాల్లో బయలు దేరుతుంది. ప్లాట్‌ఫారం హడావిడిగా వుంది. ఎస్-1 బోగి వద్ద 15 మంది గుమికూడారు. అంతా ఏడుస్తున్నారు. రైల్లో కూర్చున్న ఆమె కూడా ఏడుస్తున్నది.

"పిల్లలు జాగ్రత్త బావా! ఎప్పుడూ వదిలి వుండలేదు"

"అలాగే మేం మాత్రం నిన్ను వదిలి ఉన్నామా?. మన సంసారం ఇలా అయిపోయింది. నువ్వు దేశంకాని దేశం వెళ్ళి పనిచేయాల్సిన పరిస్థితి వస్తుందని ఎప్పుడైనా అనుకున్నామా? బాధపడకు... రెండేళ్ళలో అన్నీ సర్దుకుంటాయి" సరోజినిని సముదాయించాడు భర్త సంజీవరావు.

రైలు కదులుతున్నట్లు కూత వేసింది.

సరోజిని చేయి బయటకు పెట్టి "పిల్లలూ జాగ్రత్త. వెళ్ళగానే ఫోను చేస్తాను" అంది.

ప్లాట్‌ఫారం మీద ఉన్నవాళ్ళు కళ్ళు తుడుచుకుంటూ చేయి ఊపారు. సరోజిని మాత్రం పుట్టెడు దుఃఖంలో ఉంది.

"అమ్మా.... నాకు గొలుసు, టేప్ రికార్డరు పంపు" మనసులో కోరికను వెళ్ళబెట్టాడు చందు.

అలాగే తప్పకుండా అన్నట్లుగా తల్లి బరువుగా తల ఊపింది. రైలు కదిలిపోయింది. తనవాళ్ళు మసకగానే కనబడుతున్నారు.

సరోజినికి ఎదురుగా కూర్చున్న వ్యక్తి అయిపోయిందా దుఃఖసాగరం అన్నట్టు ఆమెవైపు చూశాడు. కువైట్, గల్ఫ్ దేశాలకు మహిళలను పంపే ఏజెంటతను. వారానికో పది రోజులకో ఒకరిని తీసుకుని ముంబాయి వెళతాడు. వెళ్ళేవాళ్ళ కన్నీళ్ళు, అయినవాళ్ళ కోరికలు అతని మజిలీలో కొత్త కాదు. అందుకే ఏమీ పట్టనట్టు నిబ్బరంగా కూర్చున్నాడు.

❋ ❋ ❋

ఫోను మ్రోగింది.

"ఒరేయ్! చెందుగా ఫోన్ తియ్యి!" సంజీవరావు కొడుకుని ఆదేశించాడు.

"నాన్నా... అమ్మా..."

తండ్రి ఒక్కసారిగా ఫోన్ అందుకున్నాడు. "ఏంటే సరోజిని... ఎలాగున్నావ్? పిల్లలంతా బానే వున్నారు... మీ చెల్లి వచ్చి వారం రోజులుండి పోయింది. మేమే వండుకు తింటున్నాం... ఇంకేటి విసయాలు?"

అటు నుంచి మాట రావటం లేదు. ఫోన్‌లో ఏడుపే వినిపిస్తోంది.

"సరోజిని ఏడవకు. ధైర్యంగా వుండు. ఏడుపుకే ఫోన్ బిల్లంతా అయిపోద్ది నీకు. ఇంకెంత... నాలుగు నెలల్లో వచ్చేస్తావుగా..."

"నాన్నా ఫోను పెట్టేయకు... అమ్మతో మాట్లాడతాను...." చందూ గొంతు.

చందు ఫోనందుకున్నాడు. అమ్మా "నా గొలుసే... టేప్ రికార్డు ఇక్కడ కొనేశాలే.. నువ్వు గొలుసు మాత్రం మర్చిపోకు".

"ఏదో తరగతి పాసయ్యావా?" సరోజిని ఆదుర్దాగా అడిగింది.

"ఆ... మూడు పరీక్షలు పాసయ్యాను... ఇంకా మూడు రాయాలి..." తెలివిగా చెప్పాననుకున్నాడు చందు.

నాలుగు నెలలు గిర్రున తిరిగాయి.

ఇల్లంతా సందడిగా ఉంది. సరోజిని కువైట్ నుంచి వస్తోంది. చేపలు, మాంసం వండించాడు సంజీవరావు. భార్య కువైట్ వెళ్ళాక అతని స్థితి మారిపోయింది. నలగని బట్టలు. ఎప్పుడూ కిళ్ళీ, కింగ్‌సైజ్ సిగరెట్. ఈ రెండేళ్ళలో కూలిపని చేసి ఎరగడు. ఊళ్ళో ఎవరు కనబడినా "పనికొస్తావా?" అని అడగటం మానేశారు. పరిచయం వున్నవాళ్ళు మాత్రం "ఏరా మీ ఆవిడ బ్యాంకుకు కరెక్టుగా పంపేస్తుందా జీతం?" అని అడుగుతారు. వాళ్ళమ్మ కోసం చందు ఆత్రుతగా ఎదురుచూస్తున్నాడు. గోల్డు గొలుసులో తన మెడ ఎలా ఉంటుందో ఊహించుకుంటున్నాడు.

సరోజిని రానే వచ్చింది. అందరి ముఖాలు వెలిగిపోయాయి. ఆమె వంక ఆమె తెచ్చిన సూట్‌కేసు వంకా ఆశగా చూశారు.

చందూ ఆపుకోలేక అడిగేశాడు.

"అమ్మా... నా గొలుసు..."

పర్సులోంచి తీసి ఆమె గొలుసు ఇచ్చింది. అతని ఆనందానికి అవధులు లేవు. తల్లి ఏం చేస్తోందో, ఎక్కడ ఉంటోందో అతనికి అనవసరం. గొలుసు వేసుకుని స్నేహితులతో తిరగాలి. చొక్కా పై బొత్తం తీసి "అమ్మా ఎలా వుందే గొలుసు?" అడిగాడు చందు.

సరోజిని బావుందని చెప్పినట్లు నవ్వింది.

✳ ✳ ✳

సరోజిని వచ్చి మూడు నెలలు అయ్యింది. రేపే ప్రయాణం.

"సరోజిని... ఈ సారి ఆ అప్పు తీర్చేయాలి..."

"ఏ అప్పు...?"

"నువ్వు దేశం వెళ్ళటానికి తీసుకున్నది. వడ్డీ తీరింది. అసలు పాతిక వేలు అలాగే ఉన్నాయి. భూమి కాగితాలు ఇడిపించమని మీ చెల్లి గొడవ చేస్తోంది. దస్తావేజులు వాళ్ళకి కావాలట. మొగుడికి చెప్పకుండా ఇచ్చానని భయపడుతోంది".

"పంపిన డబ్బంతా .... "సరోజిని నీళ్ళు నమిలింది.

"మేం తింటానికి అవదా... పైగా చందుగాడి చదువు మీ చెల్లికి పెద్దాపరేషను చేయించాను" గదుముతున్నట్లు అన్నాడు భర్త.

సరోజిని ఏం మాట్లాడలేదు. నిజం చెప్పి ఈసారి ప్రయాణం మానేసి వైద్యం చేయించుకుందామని అనుకుంది. కానీ పరిస్థితి అలా లేదు. భర్త పనిచేయడం మర్చిపోయాడు. అతనికి పని ఇచ్చినా చేయలేని స్థితి. పొట్ట అంతగా పెరిగిపోయింది. కొడుకు సరదాలు షికార్లనే నమ్ముకున్నాడు. సరోజిని మళ్ళీ అక్కడికే వెళ్ళిపోవాలని నిర్ణయించుకుంది. చదువురాని తనకు ఉత్తరం రాసి పంపలేని పరిస్థితి మేలే చేసిందని అనుకుంది.

✳ ✳ ✳

బండి రెండు నిముషాల్లో కదులుతుంది. అంతా నిబ్బరంగా వున్నారు. ఎవరూ ఏడవడంలేదు. వెళ్ళగానే ఫోను చేయమని చెప్పారు. సరోజినికి కూడా ఏడుపు రావటంలేదు. రెండేళ్ళ క్రితం జరిగిన సంఘటనలు గుర్తుకొస్తున్నాయి. ముంబాయిలో మెడికల్ పరంగా అన్‌ఫిట్ కావటం, వెళ్ళేముందు భర్త చెప్పిన "సరోజినీ! పొరపాటున భయంతో తిరిగొచ్చావా మనమంతా గుళికలు తిని చావాల్సిందే..." మాటలతో ముంబాయిలో ఉండిపోవటం అన్నీ స్ఫురణకు వస్తున్నాయి. రెడ్ సిగ్నల్ తొలగింది. రైలు కదిలింది. తన వాళ్ళందరినీ చూస్తూనే వుంది. తాను రెడ్‌లైట్ ఏరియాకు బలైపోయానని వీళ్ళకి చెబితే జాలిపడతారా... ఛీదరించుకుంటారా... మరి తను పంపిన డబ్బు... ప్రయాణమంతా ఆమెకు యివే ప్రశ్నలు... జవాబు దొరకని ప్రశ్నలు... ఈ బ్రతుకుకు మోక్షం లేదా? సరోజిని మది నిండా బరువైన ఆలోచనలే.

❋


100% AYURVEDIC PRODUCT

గ్యాస్‌ట్రబుల్‌తో బాధపడుతున్నారా?
మలబద్ధకము తో
ఇబ్బంది పడుతున్నారా?
కడుపునొప్పి మొదలగు జీర్ణశక్తికి సంబంధించిన వ్యాధులకు అనేక సంవత్సరముల నుండి ప్రయోగములు చేసి చంద్రికా వారిచే తయారుచేయబడినటువంటి అతి ఉత్తమమైన ఆయుర్వేద మందు

క్యాప్‌జైమ్
చూర్ణము




జీర, ఇంగువ, సైంధవలవణం, యవాక్షారము, ఇసఫ్‌గోల్, మారీచము మొదలగు అనేక రకములైనటువంటి అతి ఉత్తమమైన ఆయుర్వేద మూలికలతో తయారుచేయబడినది.

ఈ క్యాప్‌జైమ్ చూర్ణమ్ తీసుకొనుట వలన ఎటువంటి సైడ్‌ఎఫెక్ట్స్ రావు

మార్కెట్ చేయువారు
రామా మెడికల్ డిస్ట్రిబ్యూటర్స్ & కొ.
పార్కురోడ్, విజయవాడ - 1. ఫోన్: 2424133.